క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


జాతీయ స్థాయికి ఎంపికైన మిత్ర

మిడుతూరు: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ (అండర్-17) విభాగంలో 30, 31 వ తేదీల్లో ఎన్‌టీఆర్ జిల్లా చిలకలూర్‌లో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కస్తూర్బాబాలికల విద్యాలయం విద్యార్థిని మిత్ర మూడో స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు కేజీబీవీ ఎస్‌ఓ విజయలక్ష్మి బుధవారం తెలిపారు. పవర్ లిఫ్టింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరచి జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని మిత్రను ప్రత్యేకంగా అభినందించడంతోపాటు తర్ఫీదు ఇచ్చిన వ్యయామ ఉపాధ్యాయురాలు సుమలతను అభినందించారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

కొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికలను అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు, గొడవలు జరగకుండా ప్రశాంతంగా జరిపిస్తామని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణ్ యాదవ్ సూచించారు. బుధవారం మండలంలోని గువ్వలకుంట్ల, నందికుంట గ్రామాలలో ఎస్‌ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు కవాతు చేపట్టారు. గ్రామస్తులకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు

నల్లమలలో లారీ బోల్తా



మహానంది: నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో మిర్చిలోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కోవెలకుంట్ల నుంచి మిర్చిలోడుతో గుంటూరుకు వెళ్తుండగా మిర్చి బస్తాలు ఒరిగిపోయాయి. దీంతో లారీ అదుపుతప్పి తిరిగిపడింది. అదృష్టవశాత్తు రిటైనింగ్ వాల్‌పై కొంత భాగం ఉండిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో డ్రైవర్ మద్దిలేటితో పాటు ఇద్దరు రైతులు ప్రాణాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న రోడ్‌సేఫ్టీ సిబ్బంది రసూల్, మస్తాన్‌రెడ్డి, నూర్‌బాషా ఘటనా స్థలానికి వెళ్లి తమ వంతు సేవలు అందించారు. క్రేన్ సహాయంతో లారీని యథాస్థానానికి చేర్చారు.

వలంటీర్ల రాజీనామా


రాజీనామా పత్రాన్ని అందిస్తున్న వలంటీర్లు

మహానంది: బండిఆత్మకూరు మండలం భోజనం గ్రామంలో నలుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు బండిఆత్మకూరు ఎంపీడీఓ విజయరావు తెలిపారు. ఈ మేరకు గ్రామానికి చెందిన ఎన్.సురేష్‌బాబు, ఎస్.చంద్రపాల్, టి.చాంద్‌బాష, ఏ.జ్యోతి తమ రాజీనామా లేఖను బుధవారం ఎంపీడీఓకు అందించారు. వ్యక్తిగత కారణాలు చూపిస్తూ రాజీనామా లేఖలు సమర్పించారని ఎంపీడీఓ విజయరావు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామానికి చెందిన బి.సుబ్బరాయుడు నుంచి బుధవారం 40 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. మహానంది నుంచి తీసుకెళ్తుండగా తెలుగుగంగ కట్ట వద్ద అదుపులోకి తీసుకుని బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

దారులను మూసివేస్తే ఎలా?

నందికొట్కూరు: రైతుల పంట పొలాలకు వెళ్లే పురాతన రహదారిని మూసి నేషనల్ హైవే రోడ్డు 340 సీ నిర్మాణం ఎలా చేపడతారని రైతులు బుధవారం పట్టణ సమీపంలో హైవే నిర్మాణ పనులను అడ్డుకున్నారు. హైవే అధికారులకు, కాంట్రాక్టర్ వైఎస్సార్ జిల్లాకు చెందిన మైదకూరు టీడీపీ అభ్యర్థి పుట్ట సుధాకర్ యాదవ్‌ను, ఎన్‌హెచ్ అధికారులను రైతులు ఫోన్‌లో నిలదీశారు. హైవే అధికారులు, కాంట్రాక్టర్ అసిస్టెంట్లు రైతుల రాకపోకలకు, వీపనగండ్ల గ్రామానికి వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రహదారి నిర్మాణం చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

బాధిత రైతుకు పరామర్శ

మహానంది: బండిఆత్మకూరు మండలం యర్రగుంట్ల గ్రామంలోని కాళ్లూరి సుధాకర్‌కు చెందిన పొగాకు షెడ్డు దగ్ధమైన ఘటన తెలిసిందే. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని బాధితులతో మాట్లాడి పరామర్శించారు. చేతికందిన పంట అగ్నికి ఆహుతి కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

కన్నడిగులకు అన్నదానం


భక్తులకు అన్నం వడ్డిస్తున్న సీఐలు

నందికొట్కూరు: శ్రీశైలానికి కాలినడకన వెళ్లే కన్నడ భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని సీఐలు విజయభాస్కర్, ప్రకాష్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని జవ్వాజి సేవా కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు.


ఆత్మకూరు కొత్తపేట సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న వృద్ధులు


గువ్వలకుంట్ల గ్రామంలో పింఛన్ తీసుకునేందుకు గుమికూడిన లబ్ధిదారులు


తాటిపాడు సచివాలయం వద్ద పింఛన్ నగదు కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు


నల్లకాల్వ సచివాలయం వద్ద వృద్ధుల పడిగాపులు


సున్నిపెంట సచివాలయం వద్ద వేచి ఉన్న వృద్ధులు

అవ్వాతాతలు విల'పింఛన్'

- పింఛన్ల కోసం సచివాలయాల వద్ద వృద్ధుల పడిగాపులు
- కొన్ని చోట్ల డబ్బురాలేదని వెనక్కి పంపిన సచివాలయ సిబ్బంది
- పలుచోట్ల సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన పంపిణీ ప్రక్రియ
- చంద్రబాబుకు ఏ మాయ రోగమొచ్చిందని శాపనార్థాలు


ఇస్కాల గ్రామంలో సచివాలయం వద్ద పింఛన్ సొమ్ము కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు


మహానంది మండలం బొల్లవరం సచివాలయం వద్ద క్యూలో నిలుచున్న లబ్ధిదారులు

పగిద్యాల: పింఛన్‌ల పంపిణీని కూడా రాజకీయం చేసి రాక్షానందం పొందుతున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు దాష్టీకానికి మండుటెండల్లో పింఛన్ కోసం పండుటాకులు విలపించిన తీరు వర్ణాతీతం. వృద్ధులు, వికలాంగులు, చెవుడు, మూగ, కల్లుగీత, డయాలసిస్ రోగులు, డప్పుకళాకారులు, వితంతు మహిళలు ఆటోలలో సచివాలయాలకు చేరుకుని అగచాట్లు పడ్డారు. బుధవారం గ్రామ సచివాలయాల వద్ద పింఛన్‌లు అందిస్తారని ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఆకలిదప్పులతో చెట్ల కింద, అరుగులపై కూర్చుని పడిగాపులు కాశారు. ప్రజల కోసం ప్రభుత్వం అప్పగించిన పనిని ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రేమతో పలుకరిస్తూ పింఛన్ సొమ్మును అందించే వలంటీర్‌లపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం శోచనీయమని ఆయా గ్రామాల పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబుకు ఏ మాయ రోగం వచ్చిందని, పొరపాటున కూడా అతనికి ఓటు వేసే ప్రసక్తే లేదని శాపనార్థాలు పెట్టారు.

ఎదురుచూపులు

ఆత్మకూరురూరల్: పింఛన్ల పంపిణీ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నానికి కూడా మొదలు కాలేదు. పింఛన్ దారులు సచివాలయానికి వెళ్లి వరుసలో నిలుచుని ఉండాల్సి రావడంతో వెనుకటి టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద పడిన పడిగాపులు వారికి గుర్తుకు తెచ్చుకున్నారు. పంపిణీని మధ్యాహ్నానికి వాయిదా వేయగా.. తమవంతు వెనుకబడుతుందేమోనని వృద్ధులు సచివాలయాల వద్దే ఎదురు చూస్తూ గడిపారు. ఎట్టకేలకు మధ్యాహ్నం తరువాత పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది.

నందికొట్కూరు రూరల్ : మండలంలోని గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ల కోసం లబ్ధిదారులు ఉదయం నుంచి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పింఛన్ దారులు ఆయా సచివాలయాలకు వెళ్లి పింఛన్ల కోసం సాయంత్రం వరకూ వేచిచూడాల్సి వచ్చింది. పలుచోట్ల సాయంత్రం 4 గంటలకు పంపిణీ ప్రారంభమయ్యింది.

అయ్యో పాపం పండుటాకులు

పాములపాడు: ఈ నెల 3వ తారీఖున పింఛన్లు ఇస్తామని అధికారులు చెప్పడంతో వృద్ధులు కాళ్లీడ్చుకుంటూ సచివాలయాల వద్దకు వెళ్లి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పింఛన్ సొమ్ము రాలేదని అధికారులు చెప్పడంతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఎదురైంది. బుధవారం సాయంత్రం వరకు కూడా పింఛన్ సొమ్ము రాకపోవడంతో వృద్ధులు చంద్రబాబుకు శాపనార్థాలు పెడుతూ వెనుదిరిగారు. కొన్ని చోట్ల సాయంత్రం ప్రారంభించారు.

కొత్తపల్లి: లబ్ధిదారులు పింఛన్ తీసుకునేందకు ఉదయం నుంచే సచివాలయాల వద్ద పడిగాపుల కాస్తూ వేసవి తాపానికి ముప్పుతిప్పలు పడ్డారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో పింఛన్ పంపిణీ ప్రారంభం కావడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సాయంత్రం 6గంటలకు పింఛన్ల పంపిణీ

జూపాడుబంగ్లా: గ్రామాల్లోని పింఛన్‌దారులు ఉదయం 8 గంటలకే సచివాలయాల వద్దకు చేరుకొని పింఛన్ పుస్తకాలు వరుసలో ఉంచారు. ఉదయం 10.00 గంటలైనా తాటిపాడులో సచివాలయ ఉద్యోగులు రాకాకపోవడంతో పింఛన్‌దారులు అధికారుల కోసం తిండీతిప్పలు మానుకొని పడిగాపులు కాయసాగారు. పింఛన్లు పంపిణీ చేసేందుకు అవసరమైన డబ్బులు ఇంకా బ్యాంకు నుంచి డ్రాచేసుకొని రాలేదని వచ్చిన తర్వాత పంపిణీ చేస్తామని అధికారులు పేర్కొనడంతో అవ్వా, తాతలు తెలుగుదేశం నాయకులను నిందిస్తూ ఇంటిదారి పట్టారు. సాయంత్రం ఆరు గంటలకు పోతులపాడు, జూపాడుబంగ్లా-2 సచివాలయాల పరిధిలో సచివాలయ ఉద్యోగులు పింఛన్ పంపిణీ ప్రారంభించారు. మిగిలిన గ్రామసచివాలయాల్లో ప్రారంభం కాలేదు.

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతోపాటు కడుమూరు, మాసపేట, చౌట్కూరు , దేవనూరు తదితర గ్రామాల్లో సాయంత్రం 5 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభమయ్యింది. మిడుతూరు-1- మిడుతూరు-2 సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీని ఎంపీడీఓ గంగావతి పరిశీలించారు.

ఉదయం 7 గంటల నుంచి నిరీక్షణ

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని గ్రామసచివాలయాల వద్దకు బుధవారం ఉదయం 7 గంటలకే పింఛన్‌దారులు చేరుకున్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎవరి పుస్తకం ముందుంటే వారికే పింఛన్ డబ్బు ఇచ్చేవారు, ఇప్పుడూ అలాగే ఇస్తారని అందరూ ముందుగా సచివాలయాలకు చేరుకున్నారు. వివిధ కారణాలవలన బుధవారం మధ్యాహ్నం సచివాలయ సిబ్బంది బ్యాంకుల నుంచి నగదును తీసుకు వచ్చి సాయంత్రం 4 గంటల నుంచి పింఛన్ల పంపిణీ మొదలుపెట్టారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో, మండలంలోని సచివాలయాల వద్ద బుధవారం పింఛన్ల కోసం వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఇబ్బందులు పడ్డారు. ఉదయమే సచివాలయం వద్దకు చేరుకున్న వృద్ధులకు తీరా డబ్బులు ఇవ్వకపోవడంతో నిరాశకు గురయ్యారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై కన్నెర్రచేశారు. పట్టణంలోని 13 సచివాలయాలు, మండలంలోని 11 సచివాలయాల్లో ఇదే పరిస్థితి.

మండుటెండలో అవస్థలు

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో బుధవారం మధ్యాహ్నం వరకు సచివాలయాల వద్ద లబ్ధిదారులు పింఛన్ కోసం పడిగాపులు కాశారు. మహానంది మండలంలోని మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఇదిలా ఉండగా పింఛన్ల పంపిణీలో మహానంది మండలం రెండో స్థానంలో నిలిచిందని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండలం తొమ్మిదో స్థానంలో నిలిచినట్లు మండల పరిషత్ కార్యాలయం అధికారులు తెలిపారు.

50.44 శాతం పింఛన్ల పంపిణీ

నందికొట్కూరు: పట్టణంలోని 14 సచివాలయాల పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు. వృద్ధులకు, వికలాంగులకు, ఇంటింటికి వెళ్లి సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేశారు. పట్టణంలో 5,020 మంది పింఛన్లకు గాను 2518 మందికి 50.44 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

పింఛన్‌దారుల అగచాట్లు


వెలుగోడులో పింఛన్ల కోసం చెట్లకింద పడిగాపులు కాస్తున్న పింఛన్ దారులు

వెలుగోడు: మండలంలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ చేపట్టారు. వృద్ధులు కుటుంబ సభ్యుల సహాయంతో సచివాలయాల వద్దకు చేరుకొని పింఛన్ల కోసం పడిగాపులు కాశారు. చెట్ల కింద సేదతీరుతూ..టీడీపీ నేతల తీరును అవ్వాతాతలు ఎండగట్టారు. ఇళ్ల వద్దే పింఛన్ ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

కంటిచూపులేదు ఎలా వెళ్లాలి



నాపేరు తిక్కయ్య. మాది ఎదురుపాడు గ్రామం. నాకు కంటి చూపులేదు. మా ఇంటికి సచివాలయానికి చాలా దూరం. ఇదివరకు గ్రామ వలంటీర్ నేను ఎక్కడ ఉంటే అక్కడికివచ్చి పింఛన్ ఇచ్చేవాడు. నేను ఇప్పుడు ఎలా సచివాలయానికి వెళ్లాలి, ఎలా పింఛన్ తీసుకోవాలి. చాలా ఇబ్బందిగా ఉంది. వేరే వారి సహాయం లేకుండానే నాకు పింఛన్ అందేది. ఇప్పుడు వేరే వారిని సహాయం అడుక్కొని వచ్చి మరి పింఛన్ తీసుకుంటున్నా. మళ్లీ జగన్ వస్తేనే మాకు బాగుంటుంది.

– తిక్కయ్య, ఎదురుపాడు

ఐదేళ్లు చింతలేకుండా ఉన్నాం.. మళ్లీ కష్టాలా?:



జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లు చింతలేకుండా ఇంటి వద్దనే పింఛన్‌లు తీసుకున్నాం. నాబోటి వాళ్లకు దిగులు లేకుండా ఉండేది. మళ్లీ కష్టాలు ఎదుర్కోవాలా.. గతంలో చంద్రబాబు పాలనలో పద్నాగేళ్ల నరకయాతన అనుభవించాం. అధికారుల ఈసడింపులు, కసరింపులతో కార్యాలయాల చుట్టూ తిరుగలేక వేసారిపోయాం. ఎండలు తీవ్రంగా ఉన్నాయి. బయటకు రావాలంటనే భయం వేస్తోంది. అలాంటి రోజంతా కార్యాలయం వద్ద పడిగాపులు కాశాం. మాకొద్దు ఈ నరకాసుర బాధ. రాజన్న రాజ్యం కావాలి. మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి.

-మల్లయ్య, పగిద్యాల

సంతోషంగా పింఛన్ తీసుకోవడం చంద్రబాబుకు నచ్చదేమో?



మా లాంటి ముసలోళ్లు సంతోషంగా పింఛన్ డబ్బులు తీసుకోవడం చంద్రబాబుకు నచ్చదేమో?. మేము ఇబ్బంది పడితేనే ఆయనకు సంతోషమేమో. లేకపోతే ఇదేందయ్యా ముసలోళ్లమీద కక్షసాధింపు. మా ఉసురు ఊరికే పోదు అంతకంత అనుభవిస్తాడు. -రావుల నర్సమ్మ, కృష్ణానగర్

ముసలోళ్లను ఎండలో కూర్చోబెట్టడం చంద్రబాబుకు అలవాటే



ముసలోళ్లను ఎండలో కూర్చోబెట్టడం చంద్రబాబుక అలవాటే. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ తీసుకోవాలంటే చంద్రబాబు ప్రభుత్వంలో అవస్థలు పడ్డాం. ఎంఆర్‌ఓ ఆఫీసులో పింఛన్ పుస్తకాలు ఇస్తే మా పేరు ఎపుడు వస్తుందా అని ఎదురు చూసేవాళ్లం. ఒక రోజుకు రాకుంటే మరో రోజు వచ్చే తీసుకునేవాళ్లం. జగన్ ప్రభుత్వం వచ్చాక ఇంటికే వచ్చి పింఛన్ డబ్బులు ఇస్తున్నారు. మాయదారి చంద్రబాబు వల్ల పరిస్థితి మొదటికొచ్చింది.

- బెల్లం చెన్నమ్మ, సున్నిపెంట

ఇంటివద్దకు వచ్చి పింఛన్ ఇచ్చేవారు



గత ఐదేళ్ల నుంచి మా ఇంటి వద్దకే వచ్చి గ్రామ వలంటీర్ పింఛన్ పంపిణీ చేసేవాడు. నాకు సుమారు 85 సంవత్సరాలు ఉన్నాయి. ఎక్కువ దూరం నడవలేను. నేను ఎక్కడికి వెళ్లకుండానే ఇంటివద్దనే పింఛన్ తీసుకొనే వాన్ని. మా ఇంటికి సచివాలయానికి ఒక కిలో మీటర్ దూరం ఉంటుంది. పింఛన్ తీసుకునేందుకు వెళ్దామంటే నడవలేక పోతున్నా. అట్లానే వచ్చి పింఛన్ తీసుకున్నాను. ఇట్లా కాకుండా గ్రామ వలంటీర్లే పింఛన్ పంపిణీ చేస్తేనే బాగుంటుంది.

– మంగళి నరసింహులు, గువ్వలకుంట్ల

జగన్ వల్లే ఆనందంగా ఉన్నాం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలంటే ఎంతో ప్రేమ ఉండి, ప్రతి నెలా పింఛన్ కోసం మా ఇబ్బందులను చూసి ఇండ్ల వద్దకే వచ్చి మాకు పింఛన్ డబ్బులు అందించేలా చేశాడు. ఇది చూసి చంద్రబాబునాయుడుకు కళ్లు కుట్టాయి. ప్రతి విషయాన్ని రాజకీయ కోణంలో చూస్తే ఎలా. మానవత్వం అనేది ఉండదా. మా మేలు కోరే దేవుడిచ్చిన మనువడు జగన్‌మోహన్‌రెడ్డికి మా ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉంటాయి.

-బలరాముడు, మద్దూరు

పాలకు డబ్బులు లేవు



రెండు రోజులయ్యింది పింఛన్ రాక. ఈరోజు అమ్మా..టీ పెట్టిమ్మని నాకోడలిని అడిగాను. అత్తా పాల ప్యాకెట్‌కు డబ్బులు లేవు, పింఛన్ వస్తే తీసుకురా అని చెప్పింది. గతంలో వలంటీర్లు పొద్దున్నే వచ్చి పింఛన్ ఇచ్చే వాళ్లు. ఈ నెల ఆ డబ్బుల కోసం సచివాలయానికి వచ్చా. పొద్దున్నుంచి ఇక్కడే కూర్చున్నా. మా మనవడు జగన్ పింఛన్ ఇవ్వడం వలన కుటుంబంలో గౌరవంగా బతుకుతున్నా, లేదంటే మాలాంటి వారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం కావడం లేదు.

- జైతున్‌బీ, సున్నిపెంట

పొద్దున్నుంచి ఎదురు చూస్తున్నా



సచివాలయం వద్ద పింఛన్ డబ్బులు ఇస్తారంటే పొద్దున వచ్చాను. ఇక్కడేమో అధికారులు డబ్బుల కోసం బ్యాంకుకు వెళ్లారని, అదిగో వస్తున్నారు..ఇదిగో వస్తున్నారని చెబుతున్నారు. చెట్టు కింద కూర్చులేకపోతున్నాను. కళ్లు తిరుగుతున్నాయి. మాలాంటోళ్లను ఎందుకింత ఇబ్బంది పెడుతున్నారో అర్థం కావడం లేదు. ఇళ్ల వద్దే పింఛన్ ఇస్తే బాగుంటుంది.

- ఇద్రూస్‌మియా, వెలుగోడు చెంచుకాలనీ

పేదల బతుకులతో చంద్రబాబు ఆటలు


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: వలంటీర్ల సేవలు నిలుపుదల చేయించి, వృద్ధులు, వికలాంగులను మండుటెండల్లో అల్లాడిపోయేలా చేసిన చంద్రబాబునాయుడు రాక్షసానందం పొందుతున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. బండిఆత్మకూరులోని వీవర్స్ కాలనీకి చెందిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్) ఉమ్మడి జిల్లాల నాయకుడు కరీముల్లా(మస్తాన్), ఖాజా మొహిద్దీన్, ఇర్ఫాన్, సిద్ధిఖ్, రసూల్లాన్‌బీల ఆధ్వర్యంలో 150 కుటుంబాలకు చెందిన ముస్లింలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..... రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కుట్రల వలన వృద్ధులు ఎంతో వేదనకు గురవుతున్నారని, కొన్ని చోట్ల ఎండలకు పలువురు మృతి చెందడం బాధాకరమన్నారు.

వీవర్స్‌కాలనీలో 40ఏళ్ల సమస్య పరిష్కారం

బండిఆత్మకూరులోని వీవర్స్ కాలనీలో 40 ఏళ్ల నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ కష్టాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తీర్చారని కాలనీకి చెందిన కరీముల్లా, కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. వీవర్స్‌కాలనీలో రూ. 1.04కోట్లతో డ్రైనేజీ పనులు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం స్టేట్ జాయింట్ సెక్రటరీ విక్రమసింహానాయక్, సర్పంచ్ సంధ్య, బోధనం సర్పంచ్ బారెడ్డి భాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి


వైఎస్సార్‌సీపీలో చేరినవారితో శిల్పా కార్తీక్

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట, లింగాలగట్టు గ్రామాలలో సుమారు 100 కుటుంబాలు టీడీపీని వీడి నియోజకవర్గ యువజన నేత శిల్పా కార్తీక్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. సున్నిపెంటలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ దళిత నాయకుడు వేశపోగు నాగభూషణం ఆధ్వర్యంలో పాత మార్కెట్, బండ్లబజార్, పూర్ణానందస్వామి ఆశ్రమం సమీప వాసుల 60 కుటుంబాలు, లింగాలగట్టులోని తెలుగుదేశం పార్టీ నాయకుడు ముడి శ్రీను అతని అనుచరులు, కుటుంబీకులు 40 కుటుంబాలు కార్తీక్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరాయి. లింగాలగట్టులో టీడీపీ కార్యకర్తలందరూ దాదాపుగా వైఎస్సార్‌సీపీలో చేరినట్లే. శిల్పా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గతంలో కంటే ఎక్కువ మెజారిటీతో శిల్పా చక్రపాణిరెడ్డిని గెలిపించాలని, సామాజిక న్యాయం జరగాలంటే రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడాలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

జాతరలో భక్తులకు ఇబ్బందుల్లేకుండా చేస్తాం

జూపాడుబంగ్లా: ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యే తర్తూరు జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఈఓ వెంకటరమణ, సర్పంచ్ పీఎం నాగిరెడ్డి తెలిపారు. జాతన నిర్వహణపై బుధవారం తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామివారి ఆలయంలో అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ మాట్లాడుతూ జాతరలో ఎవరైనా అక్రమంగా మద్యం, నాటుసారా విక్రయిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. జాతరలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రస్తుతం ఇస్తున్న ఏడుగంటల త్రీఫేస్ విద్యుత్‌ను 22 నుంచి 9గంటల పాటు సరఫరా చేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ట్రాన్స్‌కో ఏఈ రామాచారి తెలిపారు.17నుంచి జాతరకు నందికొట్కూరు డిపో నుంచి బస్సులు తిప్పుతామని డిపో ఏడీఆర్ శ్రీనివాసులు తెలిపారు. వైద్యాధికారిణి డాక్టర్ యశస్విని, ఈఓపీఆర్డీ మధు మోహన చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన


కైలాసద్వారం వద్ద భక్తులతో మాట్లాడుతున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని అధికసంఖ్యలో భక్తులు పాదయాత్రగా తరలివస్తున్నారు. ఇందులో భాగంగా కైలాసద్వారం వద్ద భక్తుల సౌకర్యార్థం అటవీశాఖ, వైద్యారోగ్యశాఖ సమన్వయంతో పలు ఏర్పాట్లు చేశారు. బుధవారం ఆయా ఏర్పాట్లపై దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పరిశీలించారు. కైలాసద్వారం వద్ద కన్నడ స్వచ్ఛంద సేవకులు నిర్వహిస్తున్న అన్నదాన శిబిరాన్ని ఈఓ పరిశీలించారు. అన్నదాన నిర్వాహకులతో ఈఓ మాట్లాడుతూ శుచీ, శుభ్రత తప్పనిసరిగా పాలించాలన్నారు. పలువురు భక్తులతో ముఖాముఖిగా సంభాషించారు. ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వి. రామకృష్ణ, నీటి సరఫరా విభాగం ఏఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు లాంటి సైంధవుడు రాకూడదు


రంగారెడ్డికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: జిత్తులమారి, పొత్తులమారి చంద్రబాబు లాంటి సైంధవుడు పాలకుడిగా రాకూడదని ఏపీ శాప్ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రంగారెడ్డి స్వగృహానికి చేరుకొని వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, రిటైర్డు ఎంఈఓ రంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు సిద్ధార్థరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ అవ్వాతాతలకు ప్రతి నెల ఒటోవ తేదీన ఇంటింటికి వెళ్లి సమాజిక పింఛన్లు జగనన్న ప్రభుత్వం పంపిణీ చేసేదన్నారు. అలాంటిది ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి, నిలుపుదల చేయించాడన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, ఉస్మాన్‌బేగ్, శివరామకృష్ణారెడ్డి, జబ్బార్, సలాంఖాన్, ఆర్ట్ శ్రీను, చిన్నబాబు, మేకల రవి, శంకర్ పాల్గొన్నారు.

ముస్లింలు సీఎం జగనన్న వెంటే

నందికొట్కూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ముస్లింలకు సముచిత స్థానం లభిస్తుందని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని హాజీనగర్‌లోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ముస్లిం సోదరుల ఇచ్చిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ముస్లింలకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ అక్తర్‌బాషా పాల్గొన్నారు.

పశు గ్రాసం దగ్ధం

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామ పంచాయతీ మజరా పెంచికలపల్లి గ్రామంలో బుధవారం పశు గ్రాసం దగ్ధమైంది. గుర్తుతెలియని నిప్పుపెట్టడంతో దాదాపు రూ.లక్షకు పైగా ఆస్తి నష్టం సంభవించినట్లు బాధిత రైతు శ్రీనివాసులు వాపోయారు. గ్రామస్తులు ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించడంతో గ్రామానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే పశు గ్రాసం పూర్తిగా కాలిపోయింది.